# కొత్తవెలుగు

సంధ్యాసమయం దాటింది. లోకమంతా చీకట్లు ముసురు కుంటున్నాయి.

రిటైరయిన పరంధామయ్య మంచంమీద కూర్చుని కిటికీ లోనుంచి వీధిలో పోయే జనాన్ని చూస్తున్నాడు. ఆయన కెదురుగా లక్ష్మమ్మగారు గుమ్మంవైపే చూస్తున్నారు. పొద్దుటనగా ఉద్యోగాన్వేషణలో ఇంటిని వదలి వెళ్ళిన కొడుకు ఇంకా రాలేదు ఇద్దరి మనస్సులోను తెలియని ఆందోళన రెపరెపలాడుతోంది. అంతులేని భయం ఆవరిస్తోంది.

"అబ్బాయి ఇంకా రాలేదు" అన్నాడు ఆయన,

"ఇంకా రాలేదు ఎందుకనో" అంది ఆవిడ.

"చీకటి పడింది. లైటు వెయ్యలేదే" అన్నాడు తిరిగి.

''ఇప్పుడే వేస్తా'' అంటూ లేచి లైటు వేసింది.

ఒక్కసారి గదంతా కాంతితో నిండింది. చూడలేక ఒక్కసారి కళ్ళుమూసుకు తెరిచారు ఇద్దరు. ఇంతలో గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడ్డ కొడుకు ఇద్దరి కంటాపడ్డాడు. ఆయన చట్టుక్కున లేచి కూర్చున్నాడు. కొడుకు ముఖంలోకి చూసింది. "బాబూ! ఏదైన పని దొరికిందా?" అని అడగాలనుకొంది. రోజు అలాగె అడుగుతోంది. దొరికితే చెప్పకుండా వుంటాడా? దొరకకపోతే చిన్నపుచ్చుకుంటాడు. అందుకే ఆరోజు అడగలేక పోయింది.

అందుకే ముగ్గురు అలాగె వుండిపోయారు? ఎవరు ముందు మాట్లాడుతారో అని ఒకరికేసి ఒకరు చూస్తున్నారు. తండ్రి మంచంమీద లేచి కూర్చున్నాడు. ఒక నిమిషం చెప్పలేని నిశ్శబ్దం. అందరి మనస్సుల్లో దాగని తడబాటు.

"పని దొరికిందమ్మా" అన్నాడు ముందుగా శేఖర్ తల్లి కేసి చూసి.

"దొరికిందా బాబూ" అంది ఆవిడ పట్టలేని సంతోషంతో.

"ఎక్కడ నాయనా" అన్నాడు తండ్రి.

"ఒక ప్యాక్టరీలో. ప్రస్తుతం రెండువందలిస్తారు. ఏదో ఒకటని ఒప్పుకొన్నాను" అని అంటూనె లోపలికి అడుగు వేశాడు. ఏవేవో అడగాలనుకొన్న తల్లితండ్రులప్రశ్నలు నోట్లోనె వుండిపోయాయి.

తిండి లేకుండా మలమల ఎండిపోయె సమయంలో ఏదో ఒక ఆధారం. ఒక నిట్టూర్పు విడిచి తిరిగి మంచంమీద నడుం వాల్చాడు తండ్రి.

ఆ దంపతులకి లేక లేక పుట్టారు శేఖరు రాధా. ఒక ప్రివేటు స్కూలులో ఉపాధ్యాయునిగా పనిచేసే వారు పరంధామయ్యగారు. శేఖర్ బి. ఎ. ఫస్టు క్లాసులో పాసయ్యాడు. కూతురు రాధ ఇంటర్ పాసయింది. తెలిసినవాళ్ళంతా అదృష్టవంతులు లేరని పొగిడేవారు. నిజంగానె ఆ దంపతులు మురిసిపోయేవారు.

ఇంతలో పరంధామయ్యగారు రిటైరయ్యారు కొడుక్కి ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. కూతురుకి ఎన్ని

సంబంధాలు చూసినా పెళ్ళి కుదరలేదు. పైగా మేనరికం చేసుకోమని కబురు పెట్టింది అక్కగారు. ఆ దంపతుల కిద్దరికి చెప్ప లేని నిరుత్సాహం ఎదురైంది. పదేళ్ళు ఎక్కువ వయస్సు మీద పడినట్లైంది. దాంతో ఆరోగ్యం పాడైంది పరంధామయ్యగారికి. రోజంతా ఆ మంచంమీదే గడుపుతున్నారు.

క్రమంగా ఇల్లు గడవడం కష్టమైంది. ఆవిడ వంటిమీదున్న చిన్న చిదరం బంగారు వస్తువులు అమ్మేశారు. పెట్టెలో వున్న పాత పట్టు చీరలుకూడా వాడేశారు. ఉన్న బట్టలు వెలిసి పోయి పాతగిల్లి చిరగటం ప్రారంభించాయి. ఇంట్లో శనిదేవత తిష్ఠ వేసినట్లైంది. క్రమంగా బంధువుల రాకపోకలు దూరమయ్యాయి. స్నేహితులు మాయమయ్యారు. పరంధామయ్యగారు ఏమి చెయ్యలేక మరింత కుంగిపోయారు. రికమండేషన్ లేందే ఉద్యోగం లేదు. లంచం పొయ్యందే గుమస్తా తలెత్తి చూడడు. తానేమి చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. ఒక పూట తింటే మరొకపూట తిండిలేదు.

అటువంటి చీకటి ఆవరించిన సమయంలో కొడుక్కి ఉద్యోగం రావడం చిరు దీపంలా కనబడింది. బి. ఎ. మొదటి తరగతిలో ఉత్తీర్ణుడైన కొడుకు కలక్టరవుతా డనుకున్నారు. కనీసం బిల్లు కలక్టరుకూడా కాలేదు. అదేం ఉద్యోగమో ఏమో? అందుకే అచిన్న జీతానికే లోపల సంతోషించాడు ఆ తండ్రి.

కొడుకు కాళ్ళు చేతులు కడుక్కొని రాగానె ఆ తల్లి లేచి వంటింట్లోకి వెళ్ళింది. చీటతీసిన పాత పీట ఒకటేసి జర్మన్ సిల్వర్ కంచంలో అన్నం వడ్డించింది. పొద్దుటనగా తిని వెళ్ళిన ఆ కొడుక్కి మధ్యాహ్నం చేసిన పచ్చడివేసి అన్నం పెట్టటానికి

చేతులు రాలేదు. అయినా తప్పలేదు. గుండె అదుపులోకి తెచ్చు కొని వచ్చడేసింది. నీళ్ళ చారుగిన్నె పక్కనే పెట్టింది. నెయ్యి వేసుకునే అలవాటు ఎప్పుడో తప్పింది ఆ ఇంట్లో. మంచినీళ్ళ చెంబు పెట్టి తానుకూడా వచ్చి పక్కనే కూర్చుంది. తాటాకు విసనకర్ర తీసుకుని మెల్లిగా విసరటం ప్రారంభించింది.

బక్కచిక్కి, దవడలెండిపోయి, నెరసిన జుట్టుతో దీన మైన కళ్ళతో తనకేసి చూస్తున్న ఆ మాతృమూర్తిని దీర్ఘంగా చూసేటప్పటికి చెప్పలేని దుఃఖం ముంచెత్తుకొచ్చింది.

"అంత నీరసంగా ఉన్నావేం అమ్మా! రేపటినుంచి పళ్ళు, మందులు తెచ్చి పెడతానమ్మా" అన్నాడు.

"నాకేం నేను బాగానె వున్నాను. మీ నాన్నగారి సంగతే భయంగావుంది అయినా ఏదో వయసు వస్తోందికదా! రాధకి ఒక జాకిట్టు బట్ట లేదురా! అన్నీ చిరిగిపోయాయి. జీతం అందుకున్నాక దానికి జాకెట్టుగుడ్డ పట్టుకురారా! అంది చాటుగా పమిట కొంగుతో కళ్ళొత్తుకుంటూ! అంతకంటె అతని జీతానికి ఏమీరాదని తెలుసు—

ఇంతలో ఆ ఇంటి వెనక భాగంలో కాపురముంటున్న పని మనిషి రావులమ్మ "అమ్మగారూ!" అంటూ పిలిచింది.

"ఏం రావులమ్మా! ఇలా వచ్చావు?" అంటూ అడిగింది ఆవిడ లేచివచ్చి.

"ఏంలేదమ్మా! ఇదిగో ఈ మజ్జిగ బాబుకు పొయ్యిం దమ్మా" అంటూ మజ్జిగగిన్నె అక్కడ పెట్టింది.

"ఎందుకు రావులమ్మా! మేమంటే నీకింత ఇష్టం. ఎప్పుడో నీ కొడుకు అయ్యా దగ్గర చదువుకున్నాడు. ఎప్పుడో మేము బాగా బతికే రోజుల్లో మా దగ్గర పనిచేశావు. బంధువులంతా వదిలేసినా మమ్మల్ని పట్టుకు ప్రాకులాడుతున్నావు? నీకే మొస్తుందని రావులమ్మా!" అంది. లక్ష్మగారు.

"అంతమాటనకమ్మా! నా మొగుడు వదిలేసిపోతే నా కొడుకును నన్ను చేరతీశారు. వాణ్ణి పెద్ద చేశారు. మీ ఋణం ఎలా తీర్చుకుంటే పోతుందమ్మా!" అంది రావులమ్మ.

"అదంతా నీ మంచితనం రావులమ్మా! ఈ రోజుల్లో ఎవరుంటున్నారు."

"రాత్రి రాజయ్యగాడు పాలు పట్టుకొచ్చాడమ్మా! మిగిలిపోతే తోడుపెట్టాను. వాడికి నాకుకూడా పెరుగు పోసుకొనే అలవాటు లేదమ్మా! ఈ మాత్రానికే మీరిలా అనుకోకూడదు" అంటు వెళ్ళిపోయింది రాజమ్మ. మనస్సులో ఆమెకు నమస్కరించింది ఆవిడ. మజ్జిగగిన్నె కొండంత సంతోషంతో అంది పుచ్చుకుని కొడుకు విస్తట్లో పోసింది. పరమాన్నం వడ్డించినంత సంబరపడింది. కొడుక్కి చిక్కటి మజ్జిగంటే చాలా ఇష్టం. తెలుసుండి కూడా మజ్జిగ పొయ్యలేదు. కాఫీకి సరిపడ పాలు ఎలాగో అలాగ పోయించుకుంటున్నారు. అర గ్లాసుడు కాఫీ తాగి మధ్యాహ్నం వరకు అర్థాకలితో వుండిపోతారు.

"చాలమ్మా! చాలమ్మా! అంతా పొయ్యకు" అంటు చేతులడ్డుపెట్టాడు శేఖర్. పరిస్థితి తెలుసుకొనే మసలుతాడు శేఖర్. సగం మిగిలిన మజ్జిగగిన్నె పక్కకు పెట్టింది ఆవిడ.

శేఖర్ తృప్తిగా తిని లేచాడు. సావిట్లో వున్న పాతకర్ర మంచం వాల్చుకొని నడుం వాల్చాడు.

తర్వాత ఆ దంపతులు తిని పడుకున్నారు.

రోజులు నెమ్మదిగా గడుస్తున్నాయి. పరంధామయ్య కొడుకు ఆధారం చూసుకుని కాస్త కోలుకొన్నాడు. ఆ రోజు సాయంకాలం వీధిలోకి బయలుదేరాడు. అలా రోడ్డు చివర వరకు వెళ్ళి కొత్త రోడ్డు ఎక్కేడు. అక్కడ పెద్ద భవనం కడుతు న్నారు. మొన్నటి వరకు ఖాళీగా వున్న ఆ స్థలంలో అంత మేడ ఎప్పుడు తయారైందో ఆతనికే ఆశ్చర్యమేసింది. అంతా డబ్బు మహిమ అనుకొన్నాడు. అంతమంది కూలీలు పనిచేస్తుంటే ఎందుకో వింతగా అనిపించింది. దగ్గర కెళ్ళి నిలబడి చూడ్డం ప్రారంభించాడు.

నెత్తిమీద ఇటుకల గంప ఎత్తుకొని వెళ్లి గంప అక్కడ దింపి వస్తున్న ఆ కూలీని పరకాయించి చూశాడు. మొహం స్పష్టంగా కనబడుతోంది. అంతే కళ్ళు తిరగటం ప్రారంభిం చాయి. శరీరం పట్టు తప్పింది. కాలికింద భూమి కదిలిపోయింది నేలకు వరిగిపోయాడు.

''ఎవరో పడిపోయారు! ఎవరో పడిపోయారు'' అంటూ జనమంతా పరుగెత్తుకొంటూ వచ్చారు. మేస్త్రీ అందర్నీ తోసు కుంటూ ముందుకొచ్చి చూశాడు.

''బాబూ'' అంటూ అరిచాడు.

అతని వెనకే వచ్చిన శేఖర్ ''నాన్న'' అంటూ ఘొల్లు మన్నాడు. అక్కడున్నవారు వెళ్ళి చల్లటి నీళ్లు పట్టుకొచ్చి మొఖం మీద చల్లారు. మెల్లిగా కదిలాడు ఆయన.

కాసిని నీళ్ళు తాగించారు వాళ్లు. కాస్త తెలివిలోకి వచ్చాడు. ఎందుకాయన అలా పడిపోయారో చుట్టూ వున్నవాళ్ళకి అర్థంకాలేదు. కాని శేఖర్, రాజయ్య మాత్రం అర్థం చేసుకున్నారు. కాని పైకేమి చెప్పలేకపోయారు.

మెల్లిగా అతన్ని సాయంపట్టి ఇంటిదగ్గరకు తీసుకొచ్చారు. లక్ష్మమ్మగారు ఆ దృశ్యం చూసి బావురుమంది.

మెల్లిగా మంచంమీద పడుకోబెట్టారు. కాస్త కాఫీ పట్టించమని చెప్పి రాజయ్య డాక్టర్ని పిలుచుకొచ్చాడు.

దోషిలా నిలబడ్డాడు తండ్రి పక్కన శేఖర్ తలవంచుకుని. డాక్టర్ వచ్చి పరీక్ష చేశాడు. పక్షవాతం వచ్చిందని చెప్పాడు. కాస్త మూతి వంకర పోయింది. కుడి చెయ్యి కుడికాలు బిగుసుకుపోయాయి. ప్రాణాపాయం లేదని చెప్పి ఏవో మందులు రాసిచ్చి ఇంజక్షన్ చేసి డాక్టర్ వెళ్ళిపోయాడు ఆ వార్త వినలేకపోయింది ఆవిడ. వెక్కి వెక్కి ఏడ్చారు ఆవిడ, రాధకూడా వచ్చే దుఃఖాన్ని మనస్సులోనె దాచుకుంది. చేబులు తడుముకున్నాడు శేఖర్. రాజయ్య మందులుకోసం వెళ్ళాడు. వచ్చినవాళ్ళంతా తిరిగి వెళ్లిపోయారు.

లక్ష్మమ్మగారు భర్తపక్కన కుప్పలా కూలిపోయింది. కూతురు రాధ, కొడుకు శేఖర్ శోక దేవతల్లా నిలబడ్డారు. వారం దర్నీ రావులమ్మే ఓదారుస్తోంది.

ఇంతలో రాజయ్య మందులు పట్టుకుని తిరిగి వచ్చాడు. తన డబ్బుతోటె కొన్నాడు ఆ మందులన్నీ. మందులతోపాటు ఒక చీర పాకెట్టు అక్కడ పెట్టాడు రాజయ్య. ఇందాక రాధను

చూశాడు రాజయ్య. మాసి, కుట్లతోవున్న ఆ చీరను చూసేటప్ప టికి అతని గుండె కరిగిపోయింది. ఆ మాసికలు కనబడకుండా ఆమె చీరకొంగును సద్దుకునే ప్రయత్నం వ్యర్థమవడం అతను చూశాడు. అందుకే అంత ధైర్యం చేసి చీరకొని పట్టుకొచ్చాడు.

“ఇదేమిటి బాబూ” అంది లక్ష్మమ్మగారు. తలెత్తి చూడ్డా నికే సిగ్గుపడ్డాడు శేఖర్.

“అమ్మాయిగారికి” అనిమాత్రం అనగలిగి బయటకు వెళ్ళి నిలబడ్డాడు రాజయ్య.

అతని సంస్కారానికి ఏమని కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కాలేదు ఆ తల్లీ కొడుకులకు.

“పుచ్చుకోండమ్మా! అన్నయ్యగారు సంపాదించాక మా ఋణం తీర్చుకుందురుగాని” అంటూ రావులమ్మ బలవంతంగా చీర రాధ చేతులో పెట్టింది.

ఎంత బ్రతిమాలినా రాధ అంగీకరించలేదు. చివరకు తల్లి “పుచ్చుకో తల్లీ ఏం చేస్తాం. ఎవరిఋణమో మనకు తప్ప దమ్మా” అంది.

రాధ చీర తీసుకుని లోపలికి పరుగెత్తింది.

మందులు మింగించారు పరంధామయ్య గారిచేత. మెల్లిగా కళ్ళు విప్పాడు ఆయన. అందర్ని గుర్తుపట్టాడు. కాలు చెయ్యికూడా చూసుకున్నాడు. పరిస్థితంతా అర్థమయింది. కళ్ళ మ్మట నీళ్ళు ధారాపాత్రలుగా కురిశాయి.

“క్షమించు నాన్నా” అంటూ తండ్రిపాదాల మీద వాలి పోయాడు శేఖర్

"ఏమండీ! నాకన్యాయం చేశారండీ, మిమ్మల్ని ఇలా చూడలేనండీ" అంటూ భర్తమీద పడి వెక్కి వెక్కి యేడ్చింది ఆవిడ.

"రాజయ్య నాకావసతి కల్పించాడు నాన్న" నీకు బాధను కలిగించినందుకు క్షమించు. అంతగారంగా పెంచి చదువు చెప్పించిన చదువుకి తగిన ఉద్యోగం సంపాదించలేక పోయాను. రేపట్నుంచి పనిలోకి వెళ్ళను. అందరం పస్తులుందాం నాన్నా క్షమించు" అంటూ గొల్లుమన్నాడు.

ఈసారి రాజయ్యమీది అభిమానంతో మరింత కన్నీళ్లు వచ్చాయి ఆయనకు.

రాజయ్యను దగ్గరకు రమ్మని పిలిచాడు పరంధామయ్య.

ఎందుకో అర్థంకాని రాజయ్య "ఏమిటి బాబుగారూ" అంటూ దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

"మా బంధువులంతా నన్ను వదలినా నువ్వు, మీ అమ్మా నిలబడ్డారు. మీరే మాకు అసలు బంధువులు, ఆత్మీయులూను" అన్నాడు మెల్లిగా. కృతజ్ఞతా భావంతో చూశాడు రాజయ్య.

కొత్త చీర కట్టుకుని తలుపు వారగా నిలబడ్డ కూతుర్ని దగ్గరకు రమ్మని పిలిచాడు. ఆమె రాజయ్య ఎదురుగా తలెత్తి నిలబడలేక తల దించుకువచ్చి నిలబడింది.

మెల్లిగా కూతురు చేతిని అందుకుని రాజయ్య చేతిలో పెట్టాడు.

అందరు ఒక్కసారి ఉలిక్కి పడ్డారు.

"అదేమిటి బాబూ" అంది రావులమ్మ.

"నువ్వేమి చెప్పకు రావులమ్మా! ఎవరు అవసరానికి పనికివస్తారో వారే చుట్టాలు. కులం కాదు ప్రధానం గుణం. ధనం కాదు ప్రధానం మనస్సు. అన్ని విధాల మా అమ్మాయికి తగినవాడు నీకొడుకే" అన్నాడాయన.

"బాబుగారు క్షమించండి" అన్నాడు రాజయ్య.

"బాబుగారు కాదు మామగారు" అనాలి అన్నాడాయన.

ఇంతలో కర్తవ్యం గుర్తుకొచ్చినట్టుగా పూలదండలకోసం పరుగెత్తాడు శేఖర్.

పరంధామయ్యగారు భార్యను పిలిచారు.

"ఇదిగో చూశావా, ఎదురుగా వజ్రం ఉంటే మనం గుర్తించలేదు. కులం, మతం, అంతస్తు అంటూ ఏవేవో అడ్డుగోడలు పెట్టుకుని నానా బాధలు పడ్డాం. కొడుకు చూడు అంతస్తు వదలిపెట్టాడు. కష్టపడి హాయిగా పొట్టపోసు కుంటున్నాడు. కులం వదలిపెట్టాం. అమ్మాయి చూడు కట్నం బాధ లేకుండా, అప్పుల బాధ లేకుండా అంత గుణవంతుడైన రాజయ్యను భర్తగా పొందింది. అంత ఉత్తమురాల్ని అత్తగా పొందింది చూశావా" అన్నాడు.

"నిజమేనండి! ఇన్నాళ్ళు తెలుసుకోలేకపోయాం" అంది ఆవిడ సంతోషంతో.

"మా రాధను జాగ్రత్తగా చూసుకోవాలి బాబూ. కాస్త పెంకితనం చేస్తుంది" అంది ఆవిడ.

"రాధాదేవిగార్ని నా ప్రాణంకంటె ఎక్కువగా చూసుకుంటాను. ఆవిడ నా భార్య కావడం నేను చేసిన పుణ్యం అనుకుంటున్నాను" అన్నాడు రాజయ్య.

ఇంతలో రెండు పూలదండలతో తిరిగి వచ్చాడు శేఖర్.

అందరు తెల్లబోయారు. కొడుక్కేసి గర్వంగా చూశారా దంపతులు. సిగ్గుతో తలవాల్చింది రాధ.

ఇద్దరు దండలు మార్చుకుని అందరికి నమస్కరించారు.

"చీకటిపడుతోంది. లైటు వెయ్యవేం" అన్నారాయన.

"అదే అనుకుంటున్నా" అంటూ ఆవిడ వెళ్ళి స్విచ్చి వేసింది.

లైటు వెలిగింది. గదంతా కొత్త వెలుగులో నిండిపోయింది. అందరి ముఖాల్లో కొత్త ఆనందం తాండవించింది.

(ఆకాశవాణి సౌజన్యంతో)